క్లుప్తంగా

కాశీ విశ్వేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు



కాశిబుగ్గ: మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని వరంగల్ కాశిబుగ్గలోని కాశీ విశ్వేశ్వరాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున మహన్యాస పూర్వక రుద్రాభిషేకం చేశారు. యాగశాలలో మహా చండీ యాగాన్ని నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో ఓరుగంటి కొమురయ్య, బోడకుంట్ల వైకుంఠం, బొమ్మగాని కృష్ణమూర్తి, భాస్కర్, దయాసాగర్, రాజు, శివకుమార్, సృజన, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఇటుక బట్టీల కార్మికులకు ఎండ తీవ్రతపై అవగాహన



దేశాయిపేట: ప్రపంచ శ్రామికుల ఆరోగ్య రక్షణ దినోత్సవం (ఏప్రిల్ 28)సందర్భంగా దేశాయిపేటలోని ఇటుక బట్టీల వద్ద పనిచేస్తున్న అట్టడుగు వర్గాల శ్రామికులు ఎండ తీవ్రతను తట్టుకోవడానికి తీసుకోవాల్సిన ఆరోగ్యం, రక్షణ నియమాలపై అవగాహన కల్పించినట్లు ప్రేరణ ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. అనంతరం కార్మికులకు టవల్స్, పిల్లలకు పండ్లు, పుస్తకాలు, చల్లటి పానీయాలు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు ఉపేందర్ రెడ్డి, సంపత్‌కుమార్, రామచందర్, మనోహర స్వామి, అశోక్ పాల్గొన్నారు.

బాటసారులకు మజ్జిగ పంపిణీ



కాశిబుగ్గ: వరంగల్ కాశిబుగ్గ జంక్షన్‌లో ఎలగొండ శ్రీనివాస్, కొండా రమేష్ ఆధ్వర్యంలో బాటసారులకు ఆదివారం మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్, మాజీ కౌన్సిలర్ అంబి సాంబరాజు, కాంగ్రెస్ నాయకులు జంగం ప్రభాకర్, పాలకుర్తి హరిప్రసాద్, దొడు నాగరాజు, కోయిల్‌కార్ రాజు, బన్ని పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



మడికొండ: వాసవీ క్లబ్, వనిత క్లబ్ మడికొండ సంయుక్త ఆధ్వర్యంలో మడికొండ చౌరస్తాలో రాయల్ మెడికల్ షాప్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని క్లబ్ బాధ్యులు ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో క్లబ్ బాధ్యులు పెద్ది సంతోష్‌కుమార్, భవాని, పెద్ది నవీన్, లావణ్య, పాలారపు కిరణ్‌కుమార్, స్రవంతి, డాక్టర్ వెంకటనారాయణ, గురుపతి, జానేశ్వర్, శంకరమూర్తి, రఘునందన్, శ్రీనివాస్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులు ఓరుగల్లు కీర్తిని చాటాలి



ఖిలా వరంగల్: మే 1, 2వ తేదీల్లో వనపర్తిలో జరగనున్న రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో క్రీడాకారులు తమ సత్తాచాటి ఓరుగల్లు కీర్తిని నలుదిశలా చాటాలని వరంగల్ కిక్ బాక్సింగ్ జిల్లా అధ్యక్షుడు కరాటే ప్రభాకర్ సూచించారు. రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపికైన జయదేవ్, ఆర్యన్ రిషికేష్, శివదేవ్, జశ్వంత్, రోహిత్‌రాజ్‌ను వరంగల్ శివనగర్‌లోని భూపేష్‌నగర్‌లో కిక్‌బాక్సింగ్ వరంగల్ జిల్లా కార్యదర్శి ఇమ్మడి సంజీవ్ కుమార్, కోచ్ కల్లెపు సతీష్‌చంద్ర, శివసాయితో ప్రభాకర్ ఆదివారం అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మే 4న జిల్లా కమిటీ ఎన్నికలు, నూతన మండలాల సభ్యత్వ నమోదు కార్యక్రమాలు ఉంటాయన్నారు.

ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలి

కాశిబుగ్గ: మే 13న జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. ఈమేరకు కాశిబుగ్గలో ఆదివారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్న బీజేపీకి మాదిగలు మద్దతు తెలిపి ఎన్నికల్లో గెలిపించాలని పిలుపునిచ్చారు. బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జన్ను దినేష్, కట్ల రాజశేఖర్, సూరన్న, మంద కుమార్, మల్లన్న, శేఖర్, మహేందర్, అనిల్, రవి, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

నిలువ నీడలేక ప్రయాణికుల పాట్లు

- పట్టించుకోని అధికారులు, నాయకులు
- రైల్వే స్టేడియంలో బస్టాండ్ నిర్మాణానికి ప్రయాణికుల వినతులు



కాజీపేట ప్రధాన రహదారిపై బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు



రహదారిపైనే ఆగుతున్న బస్సులు, ఎండలో నిలబడిన ప్రయాణికులు

కాజీపేట: మాటలు కోటలు దాటుతున్నాయి.. పనులేమో గడప దాటడం లేదన్న చందంగా తయారైంది కాజీపేట వాసుల పరిస్థితి. మూడున్నర దశాబ్దాలుగా కాజీపేటలో బస్టాండ్ నిర్మిస్తామంటూ అధికారులు, నాయకులు చెబుతున్న మాటలు ఆచరణలో కార్యరూపం దాల్చక నేటికీ ప్రయాణికులు అనేక అవస్థలు పడుతున్నారు. కాజీపేట పట్టణంలో సరైన వసతులు లేక బస్సు ప్రయాణికులు అనేక ఇక్కట్లకు గురవుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం లేకపోవడం ఇక్కడ బస్టాండు ఏర్పాటు ప్రక్రియకు ప్రధాన అడ్డంకిగా మారింది.

నెరవేరని కల

దాదాపు 60వేల పట్టణ జనాభాతో పాటు నిత్యం సుమారు మూడు లక్షమందికి పైగా ప్రజలు వివిధ అవసరాల నిమిత్తం కాజీపేట మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. ట్రైసిటీలో ఒకటిగా పిలువబడే కాజీపేట పట్టణంలో సరైన వసతులతో బస్టాండ్ లేని కారణంగా ప్రధాన రహదారిపైనే ఎండ, వానల్లో అవస్థలు పడుతూ గంటల తరబడి వేచి ఉండి ప్రయాణం చేస్తుంటారు. ఆర్టీసీ అధికారులు రోడ్డు పక్కన వేసిన చిన్న షెల్టర్ల కింద నిలబడాల్సిన దుస్థితి. బస్టాండ్ అనే మాట పట్టణ ప్రజలకు తీరని ఆకాంక్షగా మిగిలింది. జాతీయ రహదారితో పాటు రైలు మార్గం ద్వారా వేల సంఖ్యలో ప్రయాణికులు కాజీపేట మీదుగా నిత్యం ప్రయాణం చేస్తుంటారు. వారంతా రోడ్లపై నిలబడే ఆటోలు, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేయాల్సిన పరిస్థితి దాపురించిందని ప్రయాణికులు వాపోతున్నారు.

ప్రభుత్వాల మధ్య కొరవడిన సమన్వయం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పూర్తిగా సమన్వయం కొరవడింది. ఫలితంగా ప్రయాణికులు నానా అగచాట్లకు గురవుతున్నారు. రైల్వే జంక్షన్ ఎదుట ఒక చిన్నపాటి బస్‌బేను నిర్మించి చేతులు దులుపుకున్నారు. ఇక్కడ ప్రయాణికులకు కనీస అవసరాలు తీరే మార్గం లేదు. ఇటు హైదరాబాద్, అటు వరంగల్ వైపు రాకపోకలు సాగించే ప్రయాణికులు ఎండలో నిలబడాల్సిందే. ఇలా బస్సుల కోసం వేచి చూస్తూ ప్రమాదాల బారినపడిన వారూ ఉన్నారు. ప్రస్తుతం రైల్వే స్టేడియంగా ఉన్న స్థలంలో కేంద్ర ప్రభుత్వం అనుమతితో బస్టాండ్ నిర్మించడం వల్ల ప్రజలకు ప్రయోజనం చేకూరే అవకాశం ఉందనే మాటలు వినిపిస్తున్నాయి.

కాజీపేటలో బస్టాండ్ నిర్మించాలి



కాజీపేట పట్టణంలో బస్టాండు నిర్మాణం అనేది ప్రజలకు కలగా మారింది. గమ్యస్థానాలకు చేరుకోవడానికి రహదారుల వెంట ప్రయాణికులు ఎండ, వానలు లెక్కచేయక నిలబడాల్సి వస్తోంది. ఆర్టీసీ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి తగు చర్యలు చేపట్టాలి.

- మారగోని భద్రయ్య, కాజీపేట

ప్రజాప్రతినిధులు స్పందిస్తేనే పనులు



జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు స్పందించి పట్టణంలో బస్టాండ్ నిర్మాణానికి అనువైన స్థలం ఎంపిక చేయాలి. రైల్వే అధికారులతో చర్చించి పట్టణం మీదుగా తిరిగే బస్సులు అన్ని ఒకే ప్రాంతంలోకి వచ్చేలా చూడాలి. రైల్వే స్టేడియంలో బస్టాండ్ నిర్మిస్తే సౌకర్యంగా ఉంటుంది.

- కాయిత యాదగిరి, సోమిడి

మడికొండ చౌరస్తాలో బస్‌షెల్టర్ లేక ఇబ్బందులు



ఎండలోనే వేచి ఉన్న ప్రయాణికులు

మడికొండ: మడికొండ చౌరస్తాలో బస్‌షెల్టర్ లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 8ఏళ్ల క్రితం రోడ్డు వెడల్పులో భాగంగా జాతీయ రహదారిపై ఉన్న చెట్లను తొలగించారు. దాంతో అప్పటి నుంచి బస్సుల కోసం ప్రయాణికులు ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మడికొండ చౌరస్తా నిత్యం వందలాది మంది ప్రయాణికులతో కిటకిటలాడుతూ రద్దీగా ఉంటుంది. అయినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు.

నిర్మాణానికి ముందుకు వచ్చినా..!

గతంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బస్‌షెల్టర్ నిర్మాణానికి ముందుకు రాగా, ఎవరూ స్థలం ఇవ్వకపోవడంతో నిర్మించలేదు. బస్‌షెల్టర్ లేక రోడ్డు పక్కన ఉన్న దుకాణాల్లోకి వెళితే సదరు షాపుల యజమానులు రానివ్వడం లేదని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మడికొండ చౌరస్తా నుంచి నుంచి చిల్పూర్, స్టేషన్ ఘన్‌పూర్, రఘునాథ్‌పల్లి, జనగామ, పాలకుర్తి, హనుమకొండ, కాజీపేట, ధర్మసాగర్, వేలేరు మండలాలకు వేలాది మంది నిత్యం ప్రయాణిస్తూ ఉంటారు. ఈక్రమంలో ప్రయాణికుల సౌకర్యార్థం బస్ షెల్టర్ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

దుర్వాసనతో ఇక్కట్లు

జాతీయ రహదారి పక్కన నిర్మించిన డ్రైయినేజీలను ఇష్టారీతిగా నిర్మించారు. దాంతో మురుగు నీరు ముందుకు సాగడంలేదు. ఈక్రమంలో బస్సుల కోసం వేచిచూసే ప్రయాణికులు దుర్వాసనతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురుగు నీరు ముందుకు సాఫీగా సాగేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

బస్ షెల్టర్ నిర్మించాలి



మడికొండ జాతీయ రహదారిపై బస్‌షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ బస్సుల కోసం వేచి చూడాల్సి వస్తోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బస్ షెల్టర్ నిర్మించాలి.

- సాంబయ్య గౌడ్, వనమాల కనపర్తి

దుకాణాల యజమానుల నుంచి చీదరింపులు



మడికొండ చౌరస్తా వద్ద బస్టాప్ లేకపోవడంతో ఎండ, వానను తట్టుకోలేక రోడ్డు పక్కనున్న దుకాణాల్లోకి వెళ్లితే సదరు యజమానులు చీదరించుకుంటున్నారు. బస్సుల కోసం నిలబడి వేచి చూడలేక పిల్లలు, వృద్ధులు ఇబ్బందులకు గురవుతున్నారు.

- గాదె సమ్మయ్య, తరాలపల్లి

కష్టపడిన వారికి గుర్తింపేది?

- ఎమ్మెల్యే ఎదుట కార్యకర్తల ఆవేదన



కార్యకర్తలతో ఎమ్మెల్యే నాగరాజు

హసన్‌పర్తి: కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు ఏదని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని రెండో డివిజన్ వంగపహాడ్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులతో ఎమ్మెల్యే నాగరాజు ఆదివారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కార్యకర్తలు తమ ఆవేదనను వెలిబుచ్చారు. వివిధ పార్టీల నాయకులను పార్టీలో చేర్చుకున్నప్పుడు కనీసం డివిజన్ నాయకులకు సమాచారం ఇవ్వరా అని ప్రశ్నించారు. అలాంటప్పుడు డివిజన్‌లో తమకు గౌరవం ఎక్కడ ఉంటోందని అడిగారు. పార్టీ అభిమానులు, కార్యకర్తలు వివిధ కారణాలతో మృతి చెందగా, వారి కుటుంబాలను పరామర్శించడానికి సమయం లేదా అని ఎమ్మెల్యేను ప్రశ్నించారు. శుభ కార్యక్రమాలకు కూడా పత్రికలు ఇచ్చినా ఎందుకు హాజరుకావడం లేదని అడిగారు. ప్రజాప్రతినిధిగా ఎన్నికై ఐదు నెలలు గడుస్తున్నా కార్యకర్తలను పట్టించుకోలేదని ఆవేదన వెలిబుచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా కార్యకర్తలు, నాయకులతో కలిసి ఫొటోకు ఎమ్మెల్యే నాగరాజు ఫోజిచ్చారు.

కేసీఆర్ రోడ్ షోకు తరలిన బీఆర్‌ఎస్ శ్రేణులు



హసన్‌పర్తి: నగరంలో నిర్వహించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రోడ్ షోకు హసన్‌పర్తి మండలంలోని వివిధ గ్రామాల నుంచి పార్టీ నాయకులు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పార్టీ, డివిజన్ అధ్యక్షులు జెండాలు ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్, డివిజన్ అధ్యక్షులు నరేద్ల శ్రీధర్, వెంకటేశ్వర్‌రెడ్డి, ఆటికం రవీందర్, కందుకూరి చంద్రమోహన్, కార్పొరేటర్ దివ్యారాణి, మాజీ కార్పొరేటర్ రాజునాయక్, దేవస్థాన కమిటీ మాజీ అధ్యక్షుడు చింతల లక్ష్మణ్, ఆత్మ జిల్లా మాజీ డైరెక్టర్ విక్టర్ బాబు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

14వ డివిజన్ నుంచి..

వరంగల్: నగరంలో ఆదివారం జరిగిన బీఆర్‌ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ బస్సు యాత్ర సభకు ఏనుమాముల 14వ డివిజన్ నుంచి జిల్లా నాయకుడు కేతిరి రాజశేఖర్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు.

47వ డివిజన్ నుంచి..



కాజీపేట రూరల్: మాజీ సీఎం కేసీఆర్ బస్సు యాత్రకు కాజీపేట 47వ డివిజన్ బాపూజీనగర్ నుంచి బీఆర్‌ఎస్ నాయకులు గబ్బెట శ్రీనివాస్, మర్యాల కృష్ణ ఆధ్వర్యంలో వేర్వేరుగా పలువురు నాయకులు ఆదివారం తరలివెళ్లారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సంకు నర్సింగరావు, నార్లగిరి రమేష్ జెండా, ఎండీ.అఫ్జల్, గాజుల విజయ్, మైలారం శంకర్, పోతుల సాంబయ్య, మంద రాజ్‌కుమార్, శ్రీకాంత్, ఉప్పల్‌రావు, కుమారస్వామి, గబ్బెట కరుణ్, ఎడ్ల ఉపేందర్, మంజుల, ప్రమీల, బాలమణి, స్రవంతి, స్వప్న, రమ పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల వద్ద పటిష్టమైన నిఘా



వాహనాలను తనిఖీ చేస్తున్న ఏసీపీ, సిబ్బంది

ఖిలా వరంగల్: వరంగల్ సబ్ డివిజన్ పరిధిలో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్టు వద్ద పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసినట్లు ఏసీపీ నందిరామ్ నాయక్ తెలిపారు. నర్సంపేట రోడ్డుపై గొర్రెకుంట పరిధిలో ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్‌ను ఏసీపీ ఆదివారం పరిశీలించారు. అనంతరం సీఐ మల్లయ్యతో కలిసి వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని, రూ.50 వేలకు పైగా నగదును తరలిస్తే సీజ్ చేస్తామని అన్నారు. ఆ మొత్తానికి సంబంధించిన రశీదులు, సరైన ధ్రువీకరణ పత్రాలు చూపించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా మేడే



మేడే వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

వరంగల్: కేంద్ర ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక మతోన్మాద ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా 138వ మేడేను ఘనంగా నిర్వహించుకోవాలని ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు గంగుల దయాకర్ సూచించారు. ఈమేరకు వరంగల్ ఎల్‌బీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఆదివారం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరుల రక్తతర్పణతో పోరాడి సాధించుకున్న హక్కులపై ప్రపంచీకరణ పేరుతో నేడు మోదీ ప్రభుత్వం దాడి చేస్తోందని వాపోయారు. 8గంటల పని దినాలకు భద్రత కల్పించే క్లాజులను నీరుగార్చి 12గంటల పని దినాలకు ఆమోద ముద్ర వేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రింటింగ్ బైండింగ్ యూనియన్ అధ్యక్షుడు మంగళంపెల్లి కుమారస్వామి కిరణ్, నాగేందర్, అలీం, రమేష్, శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సిల్వర్ జూబ్లీ వేడుకలు



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, గురువులు

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల కేంద్రంలోని మహాత్మాగాంధీ విద్యాలయం (1998 – 99 ఎస్‌ఎస్‌సీ బ్యాచ్) పూర్వ విద్యార్థుల సిల్వర్ జూబ్లీ సమ్మేళనం ఆదివారం జరిగింది. హసన్‌పర్తిలోని సంస్కృతి విహార్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తమ గత మధుర జ్ఞాపకాలను వారు గుర్తుచేసుకున్నారు. నాటి గురువులు కేదాసి వెంకటేశ్వర్లు, ఆడెపు వేణుగోపాల్, మారం నరేందర్, సంతోష్, సుధాకర్, అరుణ, కరుణశ్రీని సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కోడెల రాజు, అశోక్, మనోహర్, శ్రీనివాస్, క్రాంతి, అమ్జద్, సతీష్, కిషోర్, రాధిక, నిర్మల, కవిత, మమత, జయ పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ కమిటీకి సన్మానం



వరంగల్ చౌరస్తా: వరంగల్ జిల్లా చిరు వ్యాపారస్తుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా బార్ అసోసియేషన్ కమిటీ సభ్యులను ఆదివారం సన్మానించారు. వరంగల్‌స్టేషన్ రోడ్డులో అధ్యక్షుడు గజ్జెల లింగమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాస్, నాయకులు బాషపాక సదానందం, శామంతుల శ్రీనివాస్, పలు పార్టీల నాయకులు చింతాకుల సునీల్, చిల్వేరు శ్రీనివాస్, పరమేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

మాదిగలు ఆత్మగౌరవాన్ని చాటుకోవాలి

కాజీపేట: కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య ఓటమే ధ్యేయంగా మాదిగలు అంకితభావంతో పనిచేసి తమ ఆత్మగౌరవాన్ని చాటుకోవాల్సిన సమయం ఆసన్నమైందని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్ మాదిగ అన్నారు. బీజేపీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేష్ కమలం గుర్తుకు ఓటేద్దాం.. మాదిగల ఆత్మగౌరవాన్ని కాపాడుకుందాం అంటూ నినదించారు. ఈమేరకు కాజీపేట మండలం సోమిడి గ్రామంలో కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా కార్యదర్శి కుమ్మరి శ్రీనివాస్, మంద స్వరాజ్, ఎమ్మార్పీఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ మంద వర్ధన్, ఇనుగాల రాజు, కుమ్మరి సన్నీ, కె.సందీప్ పాల్గొన్నారు.

విరిగిన విద్యుత్ స్తంభం



ఖిలా వరంగల్: వరంగల్ బెస్తం చెరువులోని శ్రీవెంకటేశ్వర కాలనీలో 11కేవీ విద్యుత్ స్తంభం ధ్వంసమైంది. ప్రమాదకరమైన ఆ స్తంభాన్ని తొలగించి దాని స్థానంలో నూతన స్తంభాన్ని ఏర్పాటు చేయాలని అధికారులతో మొర పెట్టుకున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గాలి దుమారానికి ఒకవేళ ఆ స్తంభం కూలిపోతే ఆస్తి, ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉందని వాపోతున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి తక్షణమే విద్యుత్ స్తంభాన్ని తొలగించి నూతన స్తంభాన్ని ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరారు.

కడియం కావ్యను గెలిపించాలి



హన్మకొండ: మాట్లాడుతున్న మేడి పాపయ్య



నయీంనగర్: మాట్లాడుతున్న చెన్నయ్య

హన్మకొండ: కాంగ్రెస్ వరంగల్ లోక్‌సభ అభ్యర్థి కడియం కావ్యను గెలిపించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ పిలుపునిచ్చారు. హనుమకొండ నక్కలగుట్టలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఎమ్మార్పీఎస్ వరంగల్ పార్లమెంట్ స్థాయి కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం ఆదివారం జరిగింది. ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల నుంచి కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి ఎమ్మార్పీఎస్ సంపూర్ణ మద్దతు పలుకుతోందని అన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కేదాస్ మోహన్, మేడి రమణ, నీరటి ప్రభాకర్, బాల సోమయ్య, మెట్టుపల్లి కొమురయ్య, బొట్ల రమేష్, కొమ్ముల భిక్షపతి, పరశురాం, మేడ స్వామి, కార్యకర్తలు పాల్గొన్నారు.

కావ్యకే మాలల మద్దతు

నయీంనగర్: కాంగ్రెస్ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్యకే మాలల మద్దతు ఉంటుందని మాల ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ జి.చెన్నయ్య తెలిపారు. హనుమకొండలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను తొలగిస్తామని, రాజ్యాంగాన్ని మార్చివేస్తామని ఆ పార్టీ పెద్దలే చెబుతున్నారని అన్నారు. ఈక్రమంలో రిజర్వేషన్లు, రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలంటే కేంద్రంలో బీజేపీని గద్దె దింపి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, జి.రమేష్, కే.అనిత, శ్రవణ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆకర్షితులై బీజేపీలో చేరుతున్నారు



వరంగల్: పార్టీలోకి ఆహ్వానిస్తున్న నాయకులు



కాజీపేట: కండువా కప్పుతున్న అరూరి రమేష్

వరంగల్: గత పదేళ్లలో కేంద్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీజేపీలో చేరుతున్నారని పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థి ఆరూరి రమేష్, రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు తెలిపారు. పలు పార్టీలకు చెందిన ఎస్‌ఆర్‌నగర్, ఎన్టీఆర్‌నగర్, సుందరయ్యనగర్ తదితర కాలనీల నాయకులు బీజేపీలో ఆదివారం చేరగా ఏనుమాముల 14వ డివిజన్ కార్యాలయంలో వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. డివిజన్ అధ్యక్షుడు కొత్తకొండ రాజు అధ్యక్షతన నాయకుడు ముడుసు నరసింహా, ప్రతి సుభాష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మరోమారు అధికారంలోకి రావాలి

కాజీపేట: కేంద్రంలో మోదీ సర్కారు మరోమారు అధికారంలోకి రావాలనే సంకల్పంతో అన్ని వర్గాల ప్రజలు బీజేపీకి అండగా నిలబడటానికి ముందుకు రావడం ఆనందంగా ఉందని వరంగల్ లోక్‌సభ అభ్యర్థి అరూరి రమేష్ అన్నారు. పలు పార్టీల నుంచి బీజేపీలో చేరిన పలువురు యువకులకు కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీలో ఆదివారం కండువాలు కప్పి పార్టీలోకి ఆయన ఆహ్వానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్, నాయకులు పాల్గొన్నారు.

బీసీలకు చట్టబద్ధత కల్పించిన మోదీ



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

రామన్నపేట: బీసీలకు చట్టబద్ధత కల్పించిన ఏకైక ప్రభుత్వం మోదీ ప్రభుత్వమని ఎన్‌బీపీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్ పేర్కొన్నారు. దేశాయిపేటలోని కేఆర్ గార్డెన్‌లో బీజేపీ ఓబీసీ మోర్చా వరంగల్ జిల్లా అధ్యక్షుడు కందిమల్ల మహేష్ ఆధ్వర్యంలో పార్లమెంట్ సామాజిక సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వంలో ఐదు కేబినెట్ ర్యాంకు మంత్రులతో సహా 27 మంది మంత్రులు ఓబీసీ వర్గానికి చెందిన వారు ఉన్నారని వివరించారు. ఓబీసీ క్రీమీ లేయర్ కోసం ఆదాయ ప్రమాణాలను 2017లో రూ.6 లక్షల నుంచి రూ.8 లక్షలు పెంచారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రవికుమార్, ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, డాక్టర్ కాళీప్రసాద్, బాకం హరిశంకర్, తదితరులు పాల్గొన్నారు.